నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 30 డిసెంబర్ 2024 | NIZAMABAD



తెలంగాణ తల్లి చిత్రపటంతో ఎమ్మెల్సీ కవిత, (చిత్రంలో) మాజీ మంత్రి వేముల, ఎంపీ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, బిగాల, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

## అన్నీ ఎదురించే ఇక్కడికి వచ్చా..

"ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా నేను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను. పిడికిలి ఎత్తి, అన్నీ ఎదురించి ఇక్కడికి వచ్చా. కష్టకాలంలో నాకు మద్దతు తెలిపిన ప్రజలకు ధన్యవాదాలు. ఎన్ని నిర్బంధాలు విధించినా భయపడేది లేదు. మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలను మోసం చేసింది. పొట్ట మీద దాడి చేస్తున్న కాంగ్రెస్ సర్కారును ఎదురిద్దాం."




సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత , (చిత్రంలో) మాజీ మంత్రి వేముల, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు ఆయేషా ఫాతిమా, నాయకులు



# నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను..

- ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చినోళ్లం
- ప్రజల పక్షాన గట్టిగా నిలబడతాం
- పిడికిలి ఎత్తి ఎదురించి ఇక్కడికి వచ్చా..
- కాంగ్రెస్ పాలనలో పోలీసు జులుం నడుస్తోంది
- నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం
- నిర్బంధాల అనంతరం తొలిసారి జిల్లాకు రాక
- ఇందల్వాయి నుంచి ఘన స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు..
- తెలంగాణ తల్లి మాదిరా.. కాంగ్రెస్ తల్లి మీదిరా.. అంటూ నినాదాలు..



ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద కవితను గజమాలతో సన్మానించి, స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు



బతుకమ్మతో కవిత

నిజామాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చినోళ్లం.. గులాబీ పార్టీ వాళ్లం. గట్టిగా ప్రజల పక్షాన నిలబడతాం..' అంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక కేసీఆర్ బిడ్డలమైన రామన్న మీద, తన మీద కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, తమది భయపడే బ్లడ్ కాదు. భయపెట్టే బ్లడ్ అంటూ వ్యాఖ్యానించారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా తామెవ్వరికీ భయపడేది లేదని, తాము తప్పు చేయలేదన్నారు. తన మీద, రామన్న మీదైనా, కావాలంటే బీఆర్‌ఎస్ నాయకులపైనా ఎన్ని కేసులు పెట్టుకున్నా... నిప్పు కణికల్లా బయటికి వస్తామంటూ స్పష్టం చేశారు. అక్రమ నిర్బంధం అనంతరం నిజామాబాద్ జిల్లాకు తొలిసారి ఆదివారం కవిత వచ్చారు. ఈ సందర్భంగా 44వ నంబర్ జాతీయ రహదారి ఇందల్వాయి టోల్ ప్లాజా దగ్గరి నుంచి నిజామాబాద్ నగరం వరకు కవితకు ఘన స్వాగతం లభించింది. బీఆర్‌ఎస్ శ్రేణులు, భారత జాగృతి నాయకులు, కవిత అభిమానులు దారి పొడవునా అపూర్వ స్వాగ తం పలికారు. పలు చోట్ల గజమాలతోనూ కవితను సత్కరించారు. సుభాష్‌నగర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకుని ఉద్యమ కాలం నాటి తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి నివదించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన వేదికపై ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మనసుకు ఏది వస్తే అది హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు హామీల అమలులో చేతులు ఎత్తేశారన్నారు. మహిళలందరికీ విన్నవిస్తున్నానని, తులం బంగారం ఏదని కాంగ్రెస్ నేతలను అడగాలని, గల్లీలోకి వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు.

### మాట్లాడితే కేసులు..

కేంద్రానికి ఎదురించి మాట్లాడితే కేసు, చైనా వాడు బార్డర్ దాటి లోపలికి వచ్చిండంటే కేసు, ప్రజలకు మంచి జరుగతలేదంటే కేసు, ఇక రాష్ట్రంలో చెప్పనే అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి పేరు మరిచి పోతే కేసు, రైతు భూమి ఇయ్యకపోతే కేసు, ఫేసుబుక్కులో పోస్టు పెడి తే కేసు, ట్విట్టర్‌లో ప్రొఫెసర్లు అభిప్రాయం చెబితే కేసు, ఇన్‌స్టాలో అక్కాచెల్లెళ్లు వీడియో పెడితే కేసు అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును కవిత ఎండగట్టారు. మన సంస్కృతికి నిలువుటద్దమైన తెలంగాణ తల్లి వద్దని, హస్తం గుర్తు కలిగిన కాంగ్రెస్ బొమ్మను సెక్రటేరియేట్‌లో పెట్టారని అన్నారు. బతుకమ్మను పట్టుకున్న తల్లిని వద్దంటున్నాడని, ఒప్పుకుందామా అని ప్రజలను కవిత అడిగారు. మన తెలంగాణ తల్లి మనకు కావాల్నా వద్దా అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి మాదిరా... కాం గ్రెస్ తల్లి మీదిరా... అంటూ గట్టిగా నినదించగా ప్రజలు సైతం కోరస్ అందుకుని గట్టిగా నినాదాలు చేశారు. మన సంస్కృతి మీద దాడి చేస్తున్న కాంగ్రెస్ సర్కారును ఎదిరిద్దామని పిలుపునిచ్చారు.

### రాబోయేది గులాబీ శకమే..

ఇటున్న సూర్యుడు అటు ఉదయించినా రాబోయే కాలమంతా గులాబీ శకమేనని కవిత కుండబద్దలు కొట్టి చెప్పారు. ఈ తీర్పును ఎవరూ మార్చలేరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, రాబోయే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో కచ్చితంగా రాష్ట్రం, జిల్లా అంతటా గులాబీ జెండానే ఎగురబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. రైతుభరోసాను ఎగ్గొట్టారన్నారు. రుణమాఫీ చేసినం అంటున్నారని, మనకు రాలేదని, పక్క ఇంటోడికి రాలేదన్నారు. మరి ఎవరికి వచ్చిందో వారికే తెలుసున్నారు. ఏ ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు రాలేదన్నారు. కేసీఆర్ గురుకులాలను ఏర్పాటు చేసి లక్షలాది మందిని చదివిస్తే, గురుకులాలు నడపడం చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. వీరి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 57 మంది పిల్లలు గురుకులాల్లో చనిపోయారన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే ముగ్గురు పిల్లలు చనిపోయారని తెలిపారు. వీళ్లకు పిల్లలను కూడా చూసుకోరావడంలేదని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారని, ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో వచ్చిన నోటిఫికేషన్ ద్వారానే ఈ ఉద్యోగాలిస్తున్నారని తెలిపారు. యువ మిత్రులు పిడికిలి ఎత్తాలని, పిడికిలి ఎత్తి ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు అడగాలని సూచించారు. ఉద్యోగస్తులు ఎక్కడికి వెళ్తే అక్కడ తమతో గోడు వెళ్లబోసుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడు 40శాతం పీఆర్సీ పెంచారని, సమయానికి డీఏలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ వచ్చినంక పెండింగ్ డీఏలు మంజూరు చేయడం లేదన్నారు.



### బీఆర్‌ఎస్ ఆట మొదలైంది..

-ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 29: బీఆర్‌ఎస్ ఆట మొదలైంది. మోదీ కుళ్లును, ఈడీ జైళ్లను ఢీకొట్టిన ధీశాలి కవిత. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ వెంట పడుతాం. కాంగ్రెస్‌వీ కక్ష సాధింపు చర్యలు, బీజేపీవి రాజకీయ బెదిరింపులు. ఈ రెండు పార్టీలు రాక్షస పార్టీలుగా మారాయి. మొక్కవోని ధైర్యం తో ప్రజా క్షేత్రంలో పోరాటం సాగిస్తున్న కవిత తెలంగాణ గడ్డ గర్వపడే యోధురాలు. ఈడీ, ఐటీలను ఎదుర్కొని కడిగిన ముత్యంలాగా ప్రజల ముందుకు వచ్చారు. కేసీఆర్ ఫ్యామిలీ అంటేనే ఫైటర్ ఫ్యామిలీ. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చి తెలంగాణని అంధకారంలోకి నెట్టింది. రాష్ట్రభివృద్ధి, ప్రజా సంక్షేమమే కేసీఆర్ ఆరాటం.



### చేతకాని దద్దమ్మ రేవంత్‌రెడ్డి

- వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి

లఫంగా మాటలు, హౌలే మాటలు, ఇష్టమొచ్చిన మాటలు మాట్లాడుకుంటూ కాలం గడుపుతున్న చేతకాని దద్దమ్మ రేవంత్ రెడ్డి. కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది. స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించబోతుంది. కాంగ్రెస్ పార్టీ నాయకుడొకడు మాట్లాడుతున్నాడు బీఆర్‌ఎస్ ఫినిష్ అయ్యిందట. అరే పిచ్చోడా బీఆర్‌ఎస్ రోజురోజుకూ పెరుగుతున్నది. హామీలు అమలు చేయలేక టీవీల్లో రేవంత్ రెడ్డి కనిపిస్తే ప్రజలు చానళ్లను మార్చేస్తున్నారు. అంతటి అసహ్యించుకునే పరిస్థితి ప్రజల్లో ఏర్పడింది. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ ఖతం అవుతుంది. బీఆర్‌ఎస్ గెలవడం ఖాయం.



### దోచుకొని ఢిల్లీలో పెట్టడమే కాంగ్రెస్ నైజం

-బాజిరెడ్డి గోవర్ధన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను దోచుకొని ఢిల్లీలో పెడుతున్నది. ఆంధ్రలో రూ. 50లక్షలతో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి. ఆరు గ్యారెంటీలు లేవు. తులం బంగారం లేదు. ఏమన్న అంటే కేసులు పెట్టడం, దౌర్జన్యం చేయడం ఒక్కటే కాంగ్రెస్‌కు తెలుసు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో అడగకున్నా నిధులు ఇచ్చి అభివృద్ధి చేసింది. కానీ ఇక్కడ అడిగినా ఇచ్చేవాడు లేడు. కేటీఆర్‌పై కేసులు, ఈడీ కేసులు పెడుతున్నారు. అంటే కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని తెలుస్తున్నది.



### బతుకమ్మను కనబడకుండా చేశారు..

-బిగాల గణేశ్‌గుప్తా, అర్బన్ మాజీ ఎమ్మెల్యే

ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా జిల్లాకు వచ్చారు. ఆరోగ్యం బాగోలేక బతుకమ్మకు దూరంగా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మని కనబడకుండా చేసింది. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తారు. జిల్లా అభివృద్ధి కోసం కేసీఆర్‌తో కొట్లాడి రూ. కోట్ల నిధులు తీసుకువచ్చారు. ఆడబిడ్డల కోసం కల్యాణ లక్ష్మి తీసుకువస్తే, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పిండ్రు. ఇప్పుడు తులం బంగారంతోపాటు కల్యాణలక్ష్మి పోయింది.



### కేంద్రంపై బీఆర్‌ఎస్ యుద్ధం...

- కేఆర్ సురేశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు

కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు, రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్ని ఎన్ని కేసులు పెట్టినా ప్రజలంతా కవితతోనే ఉన్నారు. ఏడాదిలోపు ఇంత త్వరగా ప్రజా ఆదరణ కోల్పోయిందంటే అదీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమే. కొత్త సంవత్సరంలో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతపై కవిత ఆధ్వర్యంలో ఉద్యమం నడుస్తుంది. రాజ్యసభలో నలుగురమే ఉన్నా.. కేంద్రంపై బీఆర్‌ఎస్ యుద్ధం కొనసాగుతుంది.



### బతుకమ్మ అంటేనే కవిత

-ఆయేషా ఫాతిమా, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు

బతుకమ్మ అంటేనే కవిత, కవిత అంటేనే బతుకమ్మ. అందరికీ ధైర్యం కవిత. ఎంతో మందికి సహాయం చేసిన కవిత కడిగిన ముత్యంలా తిరిగి వచ్చారు. బతుకమ్మకు ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు తీసుకువస్తే దాని ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. సంస్కతి, సంప్రదాయాలను కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడంలేదు. మన బలం, మన బలగం కవితక్క.



సభకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, జాగృతి ప్రతినిధులు, అభిమానులు

---

## పట్టపగలే తవ్వకాలు!



గాండ్లపేట్ పెద్దవాగులో జేసీబీ

- గాండ్లపేట పెద్దవాగులో జేసీబీ ప్రత్యక్షం
- పట్టించుకోని అధికారులు

మోర్తాడ్, డిసెంబర్ 29: మండలంలోని గాండ్లపేట్ పెద్దవాగు నుంచి కొన్నిరోజులుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. దీనిపై ఎన్ని ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారుల్లో స్పందన కరువైంది. తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. అధికార పార్టీ నాయకులకు అధికారులు వంతపాడడంతో ఇసుక దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణాపై జిల్లావ్యాప్తంగా చర్చ జరుగుతున్నా.. తగ్గేదేలే అన్నట్లుగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాపై పత్రికల్లో కథనాలు వస్తుండగా.. 'ట్రాక్టర్లు పట్టుకున్నాం, డంప్‌లు సీజ్ చేశాం' అంటూ అధికారులు ప్రకటనలకే పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల సహకారంతో అధికార పార్టీ నాయకులు 'మేమవరికీ వినం' అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. నెల రోజులుగా గాండ్లపేట్ పెద్దవాగులో కేవలం జేసీబీ ద్వారానే ఇసుకను తవ్వేస్తున్నా.. అధికారులకు మాత్రం జేసీబీ కనిపించకపోవడం గమనార్హం. ఆదివారం పట్టపగలే జేసీబీతో గాండ్లపేట్ పెద్దవాగులో ఇసుక తవ్వకాలు చేపట్టారంటే పరిస్థితి ఎంతవరకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. అధికారుల సూచనల మేరకు వాగులోకి జేసీబీలు దిగడం, బయటికి వస్తున్నాయనే విషయం స్పష్టమవుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కామారెడ్డిలో కోలాటం ఆడుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

## కోలాటం ఆడి నిరసన..

కామారెడ్డి/ఖలీల్‌వాడి, డిసెంబర్ 29 : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 20వ రోజుకు చేరుకున్నది. సమ్మెలో భాగంగా ఆదివారం కామారెడ్డిలో ఉద్యోగులు రోడ్డుపైన కోలాటం, నృత్యం చేస్తూ నిరసన తెలియజేశారు. సమ్మెకు బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మద్దతు తెలిపారు.